‘సురక్ష’తో పేదల ఆరోగ్యానికి భరోసా

ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

కొమ్మాది: జగనన్న ఆరోగ్య సురక్షతో పేద ప్రజలందరికీ ఆరోగ్య భరోసా దక్కుతుందని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. జీవీఎంసీ 8వ వార్డు సాగర్‌నగర్‌లో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలంతా సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలనే ఆలోచనతో ఈ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్నారన్నారు. ఈ శిబిరాల్లో ప్రజలకు వైద్య పరీక్షలు చేసి, ఆరోగ్య సమస్యలు ఉన్నవారికి ఉచితంగా మందులు అందజేస్తున్నారన్నారు. ఎవరికైనా ఆపరేషన్ అవసరమైతే వేరే ఆస్పత్రులకు రిఫర్ చేసి రూపాయి ఖర్చు లేకుండా ప్రభుత్వం ఉచితంగా శస్త్రచికిత్సలు చేయిస్తుందని తెలిపారు. ప్రస్తుత కాలంలో వైద్యం ఖరీదైందని, అలాంటి వైద్య సేవలు ప్రజల ఇంటి వద్దకే అందిస్తున్న మనసున్న ప్రభుత్వం వైఎస్సార్‌సీపీదే అన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా మన రాష్ట్రంలో పేద ప్రజల సంక్షేమం కోసం అనేక పథకాలు అమలు చేస్తున్నామన్నారు. అందుకే పేదలకు మేలు జరిగితేనే మాకు ఓటు వేయండి అంటూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అడుగుతున్నారని, అలా అడిగే దమ్ము ఏ నాయకుడికైనా ఉందా అని అన్నారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ కనక మహాలక్ష్మి, కార్పొరేటర్ లొడగల అప్పారావు, వైఎస్సార్‌సీపీ 5, 7, 8 వార్డుల అధ్యక్షులు పోతిన హనుమంతు, పోతిన శ్రీనివాస్, గుడ్ల పోలిరెడ్డి, స్థానిక నాయకులు లొడగల రామ్మోహన్, ఉప్పులూరి గోపి, అల్లాడ ఉమామహేశ్వరరావు, నొడగల రాంబాబు, రమణమూర్తి, దువ్వివాసు, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


తాటితూరులో వైద్య ఆరోగ్య సిబ్బందితో ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, నాయకులు

వైద్యులు, ఆరోగ్య సిబ్బందికి సన్మానం

తగరపువలస: జగనన్న ఆరోగ్య సురక్ష పథకం విజయవంతం కోసం అలుపెరగకుండా సేవలు అందిస్తున్న వైద్య, ఆరోగ్య సిబ్బందిని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు సత్కరించారు. భీమిలి మండలం తాటితూరులో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని గురువారం ఆయన ప్రారంభించారు ఈ సందర్భంగా పథకంలో సమస్యలున్నాయా అని వలంటీర్లను అడిగి తెలుసుకున్నారు.

కార్యక్రమంలో సర్పంచ్ శిరిగుడి సంతోషి, ఈశ్వరరావు, ఎంపీటీసీ సభ్యురాలు ఉండబట్ల ఆదిలక్ష్మి, చిన్నారావు, భీమిలి ఏఎంసీ చైర్మన్ ఎలమంచిలి సూర్యనారాయణ, ఎంపీపీ దంతులూరి వాసురాజు, జెడ్పీటీసీ సభ్యుడు గాడు వెంకటప్పడు, వైస్ ఎంపీపీ బోని బంగారునాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు గాడు శ్రీను, మండల సచివాలయాల కన్వీనర్ సరగడ రఘునాథరెడ్డి, కొయ్య శ్రీనివాసరెడ్డి, దుంపల ప్రభాకర్, సింగిడి అప్పలరాజు, పల్లంటి శ్యామ్‌సుందరరావు, సమ్మిడి శ్రీనివాసరావు, జీవీ నారాయణ, లచ్చుబుగత జగదీశ్వరరావు, వైద్యులు ఏబీ మల్లికార్జునరావు, శోభారాణి, ఫణికుమార్, సాహిత్, మహమ్మద్ కౌశల్, గోవింద్, భీమిలి ఎంఈవో – 2 జయప్రద తదితరులు పాల్గొన్నారు.

సురక్ష శిబిరానికి అనూహ్య స్పందన

ఆనందపురం : మండలంలోని చందక సచివాలయం వద్ద గురువారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరానికి అనూహ్య స్పందన లభించింది. నిపుణులైన వైద్యులు స్థానికంగా మెరుగైన వైద్యం అందిస్తుండడంతో ప్రజలు శిబిరం వద్దకు చేరుకొని తనిఖీలు చేయించుకున్నారు. వలంటీర్లు, ఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ముందుగా సేకరించిన సమాచారంతో పరీక్షలు నిర్వహించారు. చిన్న చిన్న వ్యాధులకు శిబిరంలోనే మందులు అందజేశారు. దీర్ఘకాలిక రోగాలతో బాధపడుతున్న వారిని పెద్దాస్పత్రులకు రిఫర్ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బంక శ్రీను, పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకటరావు, ఎంపీటీసీ సభ్యుడు విజినిగిరి అప్పలనాయుడు, గుసిడి వెంకటరమణ పాల్గొన్నారు.

‘సురక్ష’ను సద్వినియోగం చేసుకోవాలి

పద్మనాభం: జగనన్న ఆరోగ్య సురక్షను అందరూ సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని మద్ది గ్రామంలో సురక్ష శిబిరాన్ని గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేదలు ఆరోగ్యపరంగా ఇబ్బంది పడకుండా ఉండేందుకే జగనన్న ఆరోగ్య సురక్షను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకొచ్చారన్నారు. కార్పొరేట్ వైద్యం కోసం పట్టణాలకు వెళ్లకుండా గ్రామాల్లోనే మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. అవసరమైన రోగులకు ఖరీదైన మందులు ఇస్తున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా జగనన్న ఆరోగ్య సురక్ష విధులు నిర్వహించిన వైద్యులను అభినందించారు. కార్యక్రమంలో ఎంపీపీ కంటుబోతు రాంబాబు, ఎంపీడీవో ఎం.విజయ్ కుమార్, మద్ది సర్పంచ్ బుగత సన్యాసమ్మ, వైఎస్సార్ సీపీ నాయకులు బుగత శ్రీనివాసరావు, బుగత సత్యనారాయణ, సుంకర బంగారప్పడు, బి.వి.ఎస్.ఎన్.రాజు, జి.వి.కె.కె.వర్మ, బుగత ఎర్నాయుడు పాల్గొన్నారు.


సాగర్‌నగర్‌లో మహిళకు కళ్లద్దాలు అందజేస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

నేడు ‘సురక్ష’ శిబిరం

తగరపువలస: భీమిలి మండలం లక్ష్మీపురం పంచాయతీలో శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 వరకు జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించనున్నారు. ఈ శిబిరాన్ని పంచాయతీలోని ప్రజలంతా వినియోగించుకోవాలని సర్పంచ్ లచ్చుబుగత జగదీశ్వరరావు కోరారు.

వెల్‌నెస్ సెంటర్ ప్రారంభం నేడు

పద్మనాభం: మండలంలోని పాండ్రంగిలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించనున్నామని ఎంపీడీవో ఎం.విజయ్ కుమార్ తెలిపారు. ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు హాజరై వెల్‌నెస్ సెంటర్ భవనాన్ని ప్రారంభిస్తారని ఆయన తెలిపారు.


చందకలో రోగులను పరీక్షిస్తున్న వైద్యులు


వైద్య సేవలు అందిస్తున్న మహమ్మద్ కౌశల్


కంటి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న సాహిత్

గల్లంతైన బుచ్చిబాబు మృతి

పద్మనాభం: పద్మనాభం పంచాయతీ ఇసకలపాలెం సమీపాన గోస్తనీ నదిలో గల్లంతైన శీల బుచ్చిబాబు (58) మృతదేహం గురువారం లభ్యమైంది. బుచ్చిబాబు బుధవారం మధ్యాహ్నం కాలు జారి గోస్తనీలో గల్లంతయ్యాడు. కుటుంబ సభ్యులు గాలించినా ఆచూకీ లభించలేదు. గురువారం ఉదయం ఇసకలపాలెం సమీపంలో బుచ్చిబాబు మృతదేహం గోస్తనీలో తేలి వుండగా స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారమివ్వగా కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతునికి భార్య గౌరి, ముగ్గురు పిల్లలు ఉన్నారు.

ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు


కారుషెడ్ కూడలిలో ట్రాఫిక్ నియంత్రణలో పోలీసులు

పీఎం పాలెం: కారుషెడ్ కూడలిలో ట్రాఫిక్ నియంత్రణలో భాగంగా క్రైమ్, లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్ పోలీసులు గురువారం ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఎండాడ కూడలి నుంచి బోయిపాలెం వరకూ గల కూడళ్లలో నెల రోజులపాటు ఉదయం 8 గంటల నుంచి 10 వరకూ, సాయంత్రం 5 గంటల నుంచి 7 వరకూ మూడు విభాగాల పోలీసులు ట్రాఫిక్‌ను పర్యవేక్షించనున్నారు. ట్రాఫిక్ సీఐ వెంకటరావు, లా అండ్ ఆర్డర్ సీఐ వెంకటరావు పాల్గొన్నారు.

ఏయూ రిజిస్ట్రార్‌కు అభినందన


ఏయూ రిజిస్ట్రార్ స్టీఫెన్‌తో సుజాత తదితరులు

మధురవాడ: ఆంధ్ర విశ్వవిద్యాలయం నూతన రిజిస్ట్రార్‌గా నియమితులైన ఆచార్య జేమ్స్ స్టీఫెన్‌ను గురువారం ఏపీ నగరాలు కార్పొరేషన్ చైర్‌పర్సన్ పిళ్లా సుజాత, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు పిళ్లా సత్యనారాయణ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పలు అంశాలపై ఆయనతో చర్చించారు.

క్లుప్తంగా

శరన్నవరాత్రి ఉత్సవాలకు రాట


అంబేడ్కర్ కూడలిలో ఉత్సవరాట వేస్తున్న ఆటో కార్మికులు

తగరపువలస: శ్రీదుర్గాభవానీ ఆటో కార్మిక సంఘం ఆధ్వర్యంలో అంబేడ్కర్ కూడలిలో నిర్వహించనున్న శరన్నవరాత్రి ఉత్సవాలకు గురువారం ఉత్సవరాట వేశారు. అర్చకుడు నేరెళ్ల విశ్వేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన పూజల్లో స్థానికులు, ప్రజాసంఘాల ప్రతినిధులు, ఆటో కార్మికులు పాల్గొన్నారు.

కేజీహెచ్‌లో పింఛన్ నగదు పంపిణీ


కేజీహెచ్‌లో సూర్యారావుకు పింఛను నగదు అందిస్తున్న వలంటీర్ పైడిరాజు


తగరపువలస: భీమిలి మండలం మజ్జివలస పంచాయతీకి చెందిన గర్భాం సూర్యారావు ఇటీవల అస్వస్థతకు గురై కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నాడు. ఈ సందర్భంగా మజ్జివలస సచివాలయానికి చెందిన వలంటీర్ పైడిరాజు గురువారం కేజీహెచ్‌లో సూర్యారావును కలిసి పింఛను నగదు అందించారు.

గణపతి లడ్డూ @ రూ.20 వేలు


లడ్డూ సొంతం చేసుకున్న యశ్వంత్

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డు భువనేశ్వర్ కాలనీలో వినాయక చవితి మహోత్సవాల్లో భాగంగా స్వామికి నివేదించిన 50 కేజీల లడ్డూను అదే ప్రాంతానికి చెందిన యశ్వంత్ రూ.20 వేలకు కొనుగోలు చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు క్రేజీ బోయ్స్ అసోసియేషన్ సభ్యులు మాట్లాడుతూ రూ.20 వేలతో సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

వైఎస్సార్ బీమా నగదు అందజేత


చింద్రిల్లి నరసింగరావుకు నగదు అందిస్తున్న సచివాలయ సిబ్బంది

తగరపువలస: జీవీఎంసీ ఒకటో వార్డు కొత్తపేటకు చెందిన చింద్రిల్లి నరసింగరావుకు వైఎస్సార్ బీమా పథకం కింద తక్షణ సాయంగా బొగ్గురోడ్డు సచివాలయ సిబ్బంది రూ.10 వేలు గురువారం అందించారు. ఇటీవల ఆరోగ్యం సరిగ్గా లేకపోవడంతో నరసింగరావు కుమారుడు జయరాం మృతి చెందాడు. ఈ సందర్భంగా బీమా సొమ్ము అందించారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు అక్కరమాని కిరణ్‌కుమార్, వార్డు అధ్యక్షుడు సిమ్మల ప్రసన్నకుమార్, సచివాలయ వెల్ఫేర్ సెక్రటరీ గంట్రెడ్డి గురునాథరావు, వలంటీర్ దేవి తదితరులు పాల్గొన్నారు.

విస్తృతంగా వాహనాల తనిఖీ

ఆనందపురం : ఆనందపురం జంక్షన్‌లో గురువారం పోలీసులు వాహనాలను విస్తృతంగా తనిఖీ చేశారు. ఇక్కడి కూడలి మీదుగా వెళ్లే ప్రతీ వాహనాన్ని తనిఖీ చేశారు. సీఐ రామచంద్రరావు ఆదేశాలతో ఎస్ఐలు నరసింహమూర్తి, శ్యామ్ సుందర్, ట్రాఫిక్ ఎస్ఐ రఘురామ్, సిబ్బంది తనిఖీల్లో పాల్గొన్నారు. ఇటీవల గంజాయి, మద్యం అక్రమంగా తరలిస్తున్న నేపథ్యంలో ఉన్నతాధికారుల ఆదేశాలతో తనిఖీలు చేపడుతున్నారు. పెందుర్తి, విశాఖ, విజయనగరం వైపు నుంచి వచ్చే వాహనాలను తనిఖీ చేశారు. వివిధ వాహనాల రికార్డులను కూడా పరిశీలించారు. రోడ్డుపై వాహనాలను నిలిపిన వారిపై చర్యలు తీసుకున్నారు.


ఆనందపురం జంక్షన్‌లో కారును తనిఖీ చేస్తున్న పోలీసులు

సీబీసీఎన్‌సీ ఆస్తుల పరిరక్షణకు కృషి

భీమునిపట్నం: భీమిలిలోని సీబీసీఎన్‌సీ ఆస్తులను పరిరక్షించడంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్టు స్థానిక ఆంధ్ర బాప్టిస్ట్ చర్చి కమిటీ కార్యదర్శి ప్రేమానందరావు తెలిపారు. గురువారం చర్చిలో జాయింట్ యాక్షన్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎప్పటి నుంచో ఉన్న సీబీసీఎన్‌సీ మిషనరీ సంస్థ పురాతన ఆంధ్ర బాప్టిస్ట్ చర్చిని నిర్మించిందని తెలిపారు. ఆ సంస్థ ఆస్తులు ఆక్రమణలకు గురవుతున్నాయని, కొన్నింటిని ప్రైవేటు వ్యక్తులు విక్రయిస్తున్నారని ఆరోపించారు. ఈ ఆస్తుల పరిరక్షణకు జాయింట్ యాక్షన్ కమిటీ ఏర్పాటు చేశామని తెలిపారు. చర్చి కమిటీ మాజీ అధ్యక్షుడు కె.ఎస్.ఎం.సుధాకర్, జాయింట్ కార్యదర్శి రామారావు పాల్గొన్నారు.


సమావేశంలో పాల్గొన్న చర్చి సభ్యులు

అనిట్స్ విద్యార్థులకు అభినందనలు


విద్యార్థులతో ప్రిన్సిపాల్ శ్రీరామకృష్ణ, తదితరులు

తగరపువలస: గత నెల 29 నుంచి ఈ నెల 3 వరకు పశ్చిమ గోదావరి జిల్లా మార్టేరులో నిర్వహించిన 9వ ఏపీ రాష్ట్ర స్థాయి బాస్కెట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో సంగివలస అనిట్స్ విద్యార్థులు పతకాలు సాధించారు. వీరిలో ఫైనల్ ఇయర్ విద్యార్థిని ఆర్.మహతి రెండో స్థానంలో, థర్డ్ ఇయర్ విద్యార్థి టి.వెంకట విశ్వాస్ మూడో స్థానంలో నిలిచారు. ఈ మేరకు గురువారం కళాశాలలో ప్రిన్సిపాల్ కె.శ్రీరామకృష్ణ, కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి కె.సెల్వాని దీప్తి, వ్యాయామ ఉపాధ్యాయుడు కె.వేణుగోపాల్ తదితరులు విద్యార్థులను అభినందించారు.

స్వతంత్రనగర్ పార్కుకు రూ.కోటి నిధులు

మధురవాడ: స్వతంత్రనగర్‌లోని ప్రధాన పార్కు అభివృద్ధికి అదనంగా కోటి రూపాయలు మంజూరు చేసినట్టు ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు తెలిపారు. జీవీఎంసీ 5వ వార్డు స్వతంత్రనగర్‌లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం గురువారం సాయంత్రం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నిరంతరం సంక్షేమం, అభివృద్ధికి అధిక ప్రాధాన్యమిస్తోందని పేర్కొన్నారు. సచివాలయ సిబ్బంది, వలంటీర్లు చక్కగా పనిచేసి ప్రజల మన్నలను పొందుతుంటే పవన్ కళ్యాణ్ పిచ్చిపిచ్చి ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. ఇక్కడి కాలనీలోకి ఆర్టీసీ బస్సు వచ్చేలా చర్యలు చేపట్టాలని, కాలువలు అభివృద్ధి చేయాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని స్థానికులు ఎమ్మెల్యేను కోరారు. ఈ సందర్భంగా ఆయన నాయకులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకుని, ప్రభుత్వం ద్వారా జరిగిన మేలును వివరించి, కరపత్రాలు అందించారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ కె.కనక మహాలక్ష్మి, ఈఈ శాంతిరాజు, డీఈ వంశీ, మాజీ కార్పొరేటర్ పోతిన హనుమంతురావు, వైఎస్సార్‌సీపీ 7వ వార్డు అధ్యక్షుడు పోతిన శ్రీనివాసరావు, నగరాలు కార్పొరేషన్ చైర్‌పర్సన్ పిళ్లా సుజాత, పార్టీ కల్చరల్ విభాగ రీజినల్ కో ఆర్డినేటర్ వంకాయిల మారుతీ ప్రసాద్, 5వ వార్డు జేసీఎస్ కన్వీనర్ పోతిన సురేష్‌కుమార్, సింహాచలం ట్రస్ట్‌బోర్డు సభ్యులు పిళ్లా కృష్ణమూర్తి పాత్రుడు, రైల్వే బోర్డు సభ్యులు ఎస్.బాబ్జి, పిళ్లా సూరిబాబు, నాయకులు దుర్గాసి అప్పారావు, బెల్లాపు పాపారావు, జయ, శివ, సుబ్రహ్మణ్యం, అల్లు శంకరరావు, ఎం.వి.షరీఫ్, దాసు, బండారు శివలక్ష్మి, చేకూరి రజని, తమ్మినేని వరలక్ష్మి, గాయత్రి పాల్గొన్నారు.


స్వతంత్రనగర్‌లో సంక్షేమ పథకాల కరపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

నిజాయితీకి నిదర్శనం జగనన్న పాలన

ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

పీఎం పాలెం : రాష్ట్ర ప్రజలకు సంక్షేమ ఫలాలు సకాలంలో అందించడంలో, అభివృద్ధి చేయడంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అత్యంత పారదర్శకంగా వ్యవహరిస్తున్నారని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. లంచాలకు తావులేని నీతివంతమైన పాలన అందిస్తున్నారని కొనియాడారు. ‘‘ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే’’ కార్యక్రమంలో భాగంగా శిల్పారామంలోని హాలులో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులతో గురువారం సాయంత్రం సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంతకన్నా మంచి పాలన అందించిన ముఖ్యమంత్రి గతంలో లేరని, భవిష్యత్‌లోనూ గొప్ప పాలన జగన్‌తోనే సాధ్యమన్నారు. సచివాలయ, వలంటీర్ల వ్యవస్థ ద్వారా అవినీతికి తావు లేకుండా ప్రజలు లబ్ధి పొందుతున్నారని పేర్కొన్నారు. టీడీపీ, జనసేన కలిసి వచ్చినా రానున్న ఎన్నికల్లో మరలా జగనే సీఎం అవుతారని స్పష్టం చేశారు. అందరూ ఫ్యాను గుర్తుకు ఓటు వేసి తమను గెలిపించాలని కోరారు. వలంటీర్ల సేవలను వైఎస్సార్ సీపీ నాయకులు ఎప్పటికప్పుడు ప్రోత్సహిస్తున్నారన్నారు. కార్యక్రమంలో నగరాల కార్పొరేషన్ చైర్‌పర్సన్ పిళ్లా సుజాత, సత్యనారాయణ, 8వ వార్డు కార్పొరేట్ లొడగల అప్పారావు, వైఎస్సార్ సీపీ 5, 6, 7 వార్డుల అధ్యక్షులు పోతిన హనుమంతరావు, బొట్ట అప్పలరాజు, పోతిన శ్రీనివాసరావు, సీనియర్ నాయకుడు డాక్టర్ గాదె రోశిరెడ్డి, జేఎస్ రెడ్డి, సియాద్రి కనకరాజు, పిళ్లా సూరిబాబు, కృష్ణమూర్తిపాత్రుడు, నరసింహారావు, నీరజ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు

వ్యాధులపై అవగాహన అవసరం


వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న వైద్య నిపుణుడు

పద్మనాభం: మండలంలోని కృష్ణాపురంలోని వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో గురువారం గ్రామీణ వైద్యులకు సాధారణ వ్యాధులు, నరాలు, ఎముకల వ్యాధులపై వైద్య నిపుణులు అవగాహన కల్పించారు. విశాఖపట్నం కలెక్టర్ కార్యాలయం సమీపంలోని ఆంధ్రా ఆస్పత్రి వైద్యులు కె.సందీప్ కుమార్, శ్రీరంగ గుప్తా, జె.అవినాష్ అవగాహన కల్పించారు.

పీఏసీఎస్‌ను పరిరక్షించాలని తీర్మానం


పర్సన్ ఇన్‌చార్జి మహేష్‌బాబుకు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

మధురవాడ: మధురవాడ ప్రాథమిక పరపతి సహకార సంఘం (పీఏసీఎస్)ను పరిరక్షించాలని సంఘ సభ్యులు, వివిధ రాజకీయ పార్టీ నాయకులు పర్సన్ ఇన్‌చార్జి ఎం.రమేష్‌బాబును కోరారు. గురువారం సంఘం కార్యాలయం ఆవరణలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా సంస్థ ఆదాయ, వ్యయాలు, రుణాలు, తదితర అంశాలపై కార్యదర్శి అప్పలరాజు వివరించారు. పలు అంశాలపై వాడీవేడిగా చర్చించారు. ఇక్కడి స్థలంలో పెట్రోల్ బంక్ నిర్మాణానికి ప్రయత్నిస్తుండడం సరికాదని, ఆ ఆలోచనను విరమించుకోవాలని కోరారు. సంస్థ రూ.39 లక్షలు లాభాల్లో ఉందని, దీన్ని పరిరక్షించాలని ఏకగ్రీవంగా తీర్మానం చేశారు.

యువకుడి ఆత్మహత్య

ఆనందపురం : మండలంలోని వేములవలసలో గురువారం ఓ యువకుడు ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వేములవలస బీసీ కాలనీకి చెందిన బూర్లె జగదీష్‌కు రామునాయుడు, లక్ష్మణ్ అనే ఇద్దరు కుమారులు సంతానం. రామునాయుడు మహారాష్ట్రలో ఉద్యోగం చేస్తున్నారు. లక్ష్మణ్ (30) ఎనిమిదేళ్ల క్రితం బీటెక్ పూర్తి చేసి ఉద్యోగం చేసుకుంటుండగా కరోనా సమయంలో ఉద్యోగం పోయింది. అప్పటి నుంచి లక్ష్మణ్ ఖాళీగా ఉంటున్నాడు. ఈ నేపథ్యంలో గురువారం ఇంటి టెర్రస్‌పై ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు పోలీసులకు సమచారం అందించారు. ఎస్ఐ శ్యామ్ సుందర్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

న్యాయం చేయాలని ఆందోళన

కొమ్మాది: ఓ నాయకుడి కారణంగా తమకు అన్యాయం జరుగుతోందని గాజువాకకు చెందిన రోజారమణి కుటుంబ సభ్యులు బీచ్‌రోడ్డులో గురువారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా రోజారమణి మాట్లాడుతూ... తన తల్లి 2015లో చనిపోగా, 2017లో తండ్రి మరలా పెళ్లి చేసుకున్నారని... చనిపోయిన తమ తల్లి పేరుతో పినతల్లి ఆధార్‌కార్డు సృష్టించుకుని స్టీల్‌ప్లాంట్‌లో ఉద్యోగం చేస్తున్నారని ఆరోపించారు. ఇదే విషయమై స్టీల్‌ప్లాంట్, గాజువాక పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదు చేస్తే తిమ్మాపురం ప్రాంతానికి చెందిన మారుపిల్లి అమర్‌నాథ్ రాజకీయ పలుకుబడితో పోలీసులను తప్పుదోవ పట్టిస్తున్నాడని రోజారమణి ఆరోపించారు. తిరిగి తమపైనే కేసులు పెట్టిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని అమర్‌నాథ్ వద్ద ప్రస్తావించగా ఆందోళన చేస్తున్న వారితో తనకు సంబంధం లేదన్నారు.

ఘనంగా ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవం

తగరపువలస: ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవం గురువారం జీవీఎంసీ రెండో వార్డు రామన్నపేట సాయిరవీంద్ర పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ప్రైవేట్ పాఠశాలల ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలు గంగాదేవి, లతశ్రీని కరస్పాండెంట్ బోగెల కృష్ణ, ప్రిన్సిపాల్ వాండ్రాసి సతీష్ అభినందించారు. అనంతరం కేక్ కట్ చేశారు.

మూట్ కోర్టు పోటీలు ప్రారంభం

కొమ్మాది: గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ లా ఆధ్వర్యంలో జాతీయ స్థాయి మూట్‌కోర్టు పోటీలు గురువారం ప్రారంభమయ్యాయి. గీతం మూట్, అడ్జకేసీ కమిటీ ఆధ్వర్యంలో అక్టోబర్ 8 వరకు గీతం వ్యవస్థాపక అధ్యక్షుడు ఎంవీవీఎస్ మూర్తి పేరుతో పోటీలను వర్చువల్ విధానంలో ప్రముఖ న్యాయ నిపుణుల పర్యవేక్షణలో నిర్వహించనున్నారు. పోటీలను గీతం ప్రో వీసీ గౌతమ్‌రావు ప్రారంభించారు.